క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ ఇంగ్లిష్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ఇంగ్లిష్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రజలందరూ అర్థం చేసుకోగలిగిన భాష ఆంగ్లమని, దానిని విద్యార్థులు అభ్యసిస్తే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలరన్నారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.సుధామయి మర్చంట్ ఆఫ్ వెనిస్, జూలియో రోమియట్ మొదలైన కావ్యాల రచనా సౌందర్యాన్ని చదివి వినిపించారు. విద్యార్థినులు శ్రీలక్ష్మి సంతోషి, దేవీదుర్గ షేక్ స్పియర్ గురించి వినిపించారు. చరిత్ర అధ్యాపకులు ఫణీంద్రకుమార్ వందన సమర్పణ చేశారు.

ఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించిన అబ్జర్వర్



ఎన్నికల ప్రక్రియపై సూచనలిస్తున్న అబ్జర్వర్ బాలసుబ్రహ్మణ్యం

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఎన్నికల పరిశీలకులుగా ఎలక్షన్ కమిషన్ నియమించిన కె.బాలసుబ్రహ్మణ్యం అనపర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించిన ఆయన నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియపై ఆర్ఓ ఎం.మాధురి, అధికారులకు పలు సూచనలిచ్చారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



జాతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నేషన్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ మెయిన్స్–2024(జేఈఈ) పరీక్షా ఫలితాల్లో స్థానిక జీబీఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ పరీక్షలో ఎంపీసీ విభాగంలో కళాశాలకు చెందిన ఎం.సునీల్‌బాబు జాతీయ స్థాయిలో 240వ ర్యాంకు, వీవీఆర్‌వీ దత్త 4,270 ర్యాంకు సాధించగా మరో 17 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: పరిసరాల పరిశుభ్రతతో చాలా రోగాల నుంచి దూరంగా ఉండవచ్చని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం డాక్టర్ ఎన్.రాజు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ మలేరియా దోమలు పెరిగే ప్రాంతాలు, వాటి నిర్మూలనా పద్ధతులను వివరించారు. సీహెచ్‌వో పి.వెంకటరత్నం మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ధవళేశ్వరం: చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ధవళేశ్వరం సీఐ జీవీ వినయమోహన్ తెలిపారు. 2017 జూన్ 23న ధవళేశ్వరం అగ్రహారంలోని ఒక ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి, బీరువాలోని నగలను దొంగ చోరీ చేశాడు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఉండి శివ సుబ్రహ్మణ్యాన్ని నిందితుడిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం శివసుబ్రహ్మణ్యానికి ఏడాది జైలు, రూ.2,500 జరిమానా విధిస్తూ జడ్జి పి.బాబు తీర్పునిచ్చారు. ఏపీపీ మహాలక్ష్మి వాదనాలు వినిపించారు.

రైతుల పాలిట సంజీవిని తొర్రిగెడ్డ

- 13,482 ఎకరాలకు సాగునీరు
- సుమారు 10 వేల మంది రైతులకు లబ్ధి

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గల తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ రైతుల పాలిట సంజీవినిగా మారింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో రెండు పంటలకూ సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీని ద్వారా మండలంలోని 13,482 ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీరందుతోంది. ఈ స్కీమ్‌ను 1964లో నెలకొల్పారు. అయితే పాత స్కీమ్‌ను తొలగించి, తిరిగి కొత్త భవనంలో మూడు పంపుల ద్వారా 2003 డిసెంబర్ 18 నుంచి నీరందించడం ప్రారంభించారు.

ప్రధాన కాలువ పొడవు 3.925 కిలోమీటర్లు ఉండగా, అక్కడి నుంచి ఎడమ కాలువ పొడవు 22 కిలోమీటర్లు, కుడి కాలువ పొడవు 17 కిలోమీటర్లు ఉన్నాయి. పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకూ అధికారికంగా 13,482 ఎకరాలకు దీని ద్వారా నీరు అందిస్తున్నారు. ఈ స్కీమ్‌లో మూడు మోటార్లు ఉండగా, అందులో ఒకటి స్టాండ్‌బైగా ఏర్పాటు చేశారు. ఒకొక్క పంపు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంది. ప్రతి రోజూ రెండు పంపుల ద్వారా 240 క్యూసెక్కుల నీటిని వదులుతారు.



తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ ఎడమ కాలువలో సాగునీరు



పురుషోత్తపట్నంలోని తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్

నెల ముందుగానే నీరు విడుదల

మునుపెన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నెల రోజుల ముందుగానే సాగునీరు అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాది జూలై ఆఖరు వారంలో సాగునీరు అందించేవారు. రెండో పంటకు రైతుల నుంచి నగదు వసూలు చేసినా, సక్రమంగా నీరు ఇచ్చేవారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జూన్ మొదటి వారంలో సాగునీరు పుష్కలంగా అందిస్తున్నారు. అలాగే రబీలో వేసే ఆరుతడి పంటలకూ నీరు సమృద్ధిగా అందుతోంది.

సమృద్ధిగా నీరు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ఖరీఫ్‌లో నెల రోజుల ముందుగానే సాగునీటిని అందిస్తున్నారు. వరి ఆకుమడులకు స్కీమ్ నుంచి వచ్చిన నీటినే ఉపయోగిస్తున్నాం. రబీలో ఆరుతడి పంటలకు కూడా నీరు అందుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో జూలై నెలాఖరుకు సాగునీరు అందించినా, సక్రమంగా వచ్చేది కాదు. వరి ఆకుమడులకు నీరు పెట్టడానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం.

– గద్దె వీరన్నబాబు, రైతు, రామచంద్రపురం

టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు



గత టీడీపీ ప్రభుత్వంలో ఖరీఫ్‌కు నీరు సక్రమంగా వచ్చేదికాదు. ఇక రెండో పంటకు నీరు ఇవ్వడానికి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఇప్పుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హయాంలో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. సాగునీరు పుష్కలంగా అందడంతోనే పంటలు చక్కగా పండుతున్నాయి. సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ధన్యవాదాలు.

–ముదునూరి రామకృష్ణరాజు, రైతు, చినకొండేపూడి

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రంగంపేటలో ఇంటింటా ఎన్నికల ప్రచారం



రంగంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని గజమాల, పూల కిరీటంతో సత్కరిస్తున్న నాయకులు



రంగంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలందరూ శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తమ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాల, పూల కిరీటం అలంకరించి మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు అమలు చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సంక్షేమ సారథికి అందరూ అండగా నిలుద్దామన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వాహనమిత్ర, కాపునేస్తం తదితర పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా సొమ్ము జమ చేశారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు, శివదుర్గ, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



బిక్కవోలులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- బిక్కవోలులో ఎన్నికల ప్రచారం

బిక్కవోలు: ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలే లబ్ధిదారులుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తు ఓటు వేసి తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ డాక్టర్ జంగా మురళీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల అభ్యున్నతి



కూనవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో పేదల ఆర్థిక అభ్యున్నతి సాధించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. కూనవరంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఐదేళ్ల పాలనలో గ్రామంలో అమలు చేసిన ప్రగతిని వివరించారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు ప్రజలకు ఎంతో చేరువయ్యాయని, వాటి ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను నేరుగా అందాయన్నారు. ఆయన సంక్షేమ పాలనను మరోసారి తీసుకురావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఉప సర్పంచ్ మండపాక గణేష్, అయిల మాధవరావు, అయిల పాపారావు, నల్లమోలు పాపారావు, కొండాటి సతీష్, అయిల ఉపేంద్ర, నల్లమోలు నూకరావు, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి విరమణ ఉండదు



వెంకటరెడ్డి దంపతులను సత్కరిస్తున్న వీసీ పద్మరాజు, చిత్రంలో ముత్యాలు నాయుడు

రాజానగరం: ఉపాధ్యాయ ఉద్యోగానికి విరమణ ఉందని, కానీ ఆ వృత్తికి లేదని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు. ఉపాధ్యాయుడు జీవనం సాగించినంత కాలం బోధనను కొనసాగించవచ్చన్నారు. శ్రీరామపురంలోని ఎయిడెడ్ పాఠశాలలో 38 ఏళ్ల ఉపాధ్యాయుడిగా సేవలందించి, వచ్చే నెలలో రిటైర్డ్ కాబోతున్న గొలుగూరి వెంకటరెడ్డిని సతీసమేతంగా స్థానిక జీఎస్ఎల్ ఆడిటోరియంలో గురువారం సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ వీసీ ఎం.ముత్యాలు నాయుడు మాట్లాడుతూ అందరి మన్ననలు అందుకుంటూ ఉద్యోగ విరమణ చేయడం అందరికీ సాధ్యం కాదన్నారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్, పూర్వపు ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) మాట్లాడుతూ సమాజానికి మార్గనిర్దేశకుడు ఉపాధ్యాయుడేనని, అందుకనే తల్లిదండ్రుల తరువాత స్థానాన్ని అందుకోగలుగుతున్నాడన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మండలంలోని ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటరెడ్డిపై తమకున్న అభిమానాన్ని వ్యక్తపరచ్చడంతోపాటు ఆ దంపతులను దుశ్శాలువాలు, నూతన వస్త్రాలు, పూలమాలలతో సత్కరించారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: మలేరియా రహితంగా జిల్లాను తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దోమల నివారణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి గురువారం బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంటా, బయట, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టగలమన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రకటించి పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వరరావు, ఏపీడిమాలడిస్ట్ సుధీర్ బాబు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజానికి కృషి

కడియం: మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్య సిబ్బంది ఆసుపత్రి నుంచి కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. చుట్టుపక్కల నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమల వ్యాప్తి జరగదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.మణి జ్యోత్స్న, జి.స్వరూప, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, కృష్ణకుమారి, ఉమాదేవి, విల్సన్ పాల్, మురళి, మూర్తి పాల్గొన్నారు.

సహిత విద్యాభివృద్ధికి మెరుగైన ప్రణాళిక



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: సహిత విద్యాభివృద్ధికి మెరుగైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా సమగ్రశిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో సహిత విద్యా కార్యక్రమాలపై జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన సదస్సును ప్రకాష్ నగర్ ధర్మంచర ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్ఈవో వాసుదేవరావు మాట్లాడుతూ సహిత విద్యా విభాగాన్ని ఒక సేవగా భావించి ప్రతి పిల్లవానికి సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారిని సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. సహిత విద్యావిభాగం ఉద్యోగులు ఎంతో ఓర్పుతో బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమానికి జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అధ్యక్షత వహించారు. స్టేట్ అబ్జర్వర్ రాధిక, రాజమహేంద్రవరం డివిజన్ డీవైఈవో ఈవీబీఎస్ నారాయణ, జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ కుమారి, జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎస్.కనక బాబు తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజున 16 నామినేషన్లు

అనపర్తి: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. నామినేషన్ల చివరి రోజు 14 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్ఓ ఎం.మాధురి తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మూడు సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా డమ్మీ అభ్యర్థిగా నల్లమిల్లి మహాలక్ష్మి, జై భారత్ పార్టీ తరపున రంగంపేటకు చెందిన కారి దాసు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా రాయవరం మండలం కూర్మాపురానికి చెందిన కొమ్మన సత్య జానకిలు నామినేషన్ పత్రాలను ఆర్ఓకు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా 10 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనపర్తికి చెందిన కుమ్మరి శారమ్మ, ఒంటిమి అరవింద్, అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పులగం సూర్రెడ్డి, బిక్కవోలుకు చెందిన మజ్జి శ్రీనివాసరావు, అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి దేవదాన రెడ్డి, చెల్లె శ్రీను, పెదపూడి మండలం జి.మామిడాడకు చెందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన రేలంగి నాగేశ్వరరావు, రేలంగి ఏసుబాబు, పులపకూరి వీరవెంకట సత్యనారాయణ, చెల్లె శ్రీనులు నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. వీటితో కలిపి అనపర్తి నియోజకవర్గానికి మొత్తంగా 25 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

17 నామినేషన్ల దాఖలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి చివరి రోజైన గురువారం 10 మంది అభ్యర్థులు 17 నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరపున కొత్తపల్లి భాస్కరరామ్ రెండు సెట్లు, నాళం సూర్యలక్ష్మీనారాయణ ద్వారా వైఎస్సార్ సీపీ తరపున గంధం రాజేశ్వరి రెండు సెట్లు, కాంగ్రెస్ తరపున ముంద్రు వెంకట శ్రీనివాస్ నాలుగు సెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున పానగంటి అప్పల సత్యనారాయణ ఒక సెట్, ఇండియన్ ప్రజాబంధు పార్టీ తరపున మద్దా వెంకటరావు ఒక సెట్, బహుజన సమాజ్ పార్టీ తరపున నల్లమిల్లి రవికుమార్ ఒక సెట్, దొడ్డా వెంకటేశ్వర్లు ద్వారా జనసేన తరపున బత్తుల బలరామకృష్ణ రెండు సెట్లు, ఇండిపెండెంట్లుగా బర్రె ఆనంద్‌కుమార్ రెండు సెట్లు, బత్తుల బాలబ్రహ్మం ఒక సెట్, బత్తుల వందన అంబిక ఒక సెట్ నామినేషన్ అందజేశారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

రాజానగరం: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చేసిన ఏర్పాట్లను జనరల్ అబ్జర్వర్ కె.బాలసుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లను, సంబంధిత రికార్డులను పరిశీలించి, సూచనలిచ్చారు. అనంతరం రాజానగరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా కొద్ది సేపు పరిశీలించి, రిటర్నింగ్ అధికారి ఎ. చైత్రవర్షిణి, సహాయ రిటర్నింగ్ అధికారి అబ్దుల్ రహమాన్ మస్తాన్‌లకు సూచనలిచ్చారు.

ఏపీ సెట్ నిర్వహణపై సమీక్ష

రాజానగరం: ఏపీ స్టేట్ ఎలిజిబులిటీ పరీక్షను ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్లతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం సమీక్షించారు. రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలో ఏర్పాటు చేసిన 11 కేంద్రాలలో ఏడు వేల మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పేపర్ వన్, టు పరీక్షలు జరుగుతాయన్నారు. సమయానికంటే ఒక గంట ముందుగానే అభ్యర్థులు కేటాయించిన పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని వీసీ సూచించారు.

ఘనంగా పునీత మార్క్ పండగ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పునీత మార్క్ పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ మాట్లాడుతూ పునీత మార్క్‌ను ప్రతి క్రైస్తవుడూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి, శాంతి ఏర్పడాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపదేశి రాయి థామస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ మెంబర్‌కు సన్మానం

మధురపూడి: ఏఈఎల్‌సీ కౌన్సిల్ మెంబర్, డాక్టరేట్ అవార్డు గ్రహీత జాన్ మాణిక్యాలరావును గురువారం కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చిలో ఘనంగా సత్కరించారు. చర్చి పాస్టర్ కృపా విల్సన్ మాట్లాడుతూ మాణిక్యాలరావు 35 ఏళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ఎనలేని కృషి చేశారన్నారు. కరోనా సమయంలో ఆయన నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను హైదరాబాద్‌లోని ఆంధ్ర క్రైస్తవ దైవజ్ఞాన (ఏసీటీసీ) కళాశాల ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేసిందన్నారు. కార్యక్రమంలో నిస్సి నిహారిక, ప్రవీణ్, ఎజ్రా, వరదానం, విజయ్, డేవిడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో రాజానగరం, తూర్పుగానుగూడెం, సూర్యారావుపేట, పల్లకడియం, రామస్వామిపేట, బ్రిడ్జికౌంటీ, జీఎస్ఎల్, నన్నయ వర్సిటీ, గైట్ కళాశాల క్యాంపస్ ప్రాంతాలలోని గృహ, వ్యవసాయ అవసరాలకు సరఫరా ఉండదన్నారు.

దివాన్‌చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో..

దివాన్‌చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శ్రీధర్ వర్మ తెలిపారు. శ్రీరామపురం వాసులకు విద్యుత్ అవసరాలకు ఈ సమయంలో అంతరాయం కలుగుతుందన్నారు.